ప్రజాశక్తి

ఆదివారం 20 జులై 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

సంపన్నుల షాక్!

- అధికారులదే బాధ్యత!
- 'బంగారు కుటుంబాల'పై సర్కారు తాజా విధానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఊహల స్వర్గం 'బంగారు కుటుంబాల' పథకంపై నీలినీడలు పడ్డాయి. చంద్రబాబు పి-4 విధానమైన (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) భావనకు గండిపడే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. విశాఖపట్నం జిల్లాలో 22.50లక్షల మంది జనాభాకు గానూ 73,949 మంది పేదలను 'బంగారు కుటుంబాలు'గా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ నేతృత్వంలో చీఫ్ ప్లానింగ్ కార్యాలయ అధికార యంత్రాంగం, సచివాలయాల వ్యవస్థ ద్వారా గుర్తించారు. వీరికి ఆర్థిక మద్దతును ఇచ్చేందుకు గానూ పారిశ్రామిక, రాజకీయ, సంపన్న వర్గాల నుంచి సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారంగా జిల్లా యంత్రాంగం కసరత్తు చేసింది. ఇంతలోనే కథ అడ్డం తిరిగింది. ఇంతవరకూ గుర్తించిన కుటుంబాలకు సంబంధించి ఒక్కరంటే ఒక్కరూ పేదలను ఉద్దేరించేందుకు ముందుకు రాకపోవడం విశేషం. దీంతో వేరేగతి లేక జిల్లా అధికారులు, గజిటెడ్ హోదా కలిగిన వారు, మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ, విఎంఆర్‌డిఎ, కలెక్టరేట్ ఇలా అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత పెట్టింది. పి-4 విధానం ప్రకారం పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్ అన్న భావనకు అద్దం పట్టేలాగ ఈ కసరత్తు చేయాలని ప్రభుత్వం భావించినప్పటికీ ఆచరణలో తల్లకిందులైందనే చెప్పొచ్చు. ఒక ఉన్నతాధికారి మాటల్లో చెప్పాలంటే 'ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంపన్నులు తమ పనులు చేసుకోడానికి కాంట్రాక్టులు దక్కించుకోడానికి చూస్తున్నారు తప్ప పేదలను ఉద్ధరించే పని వారికి పట్టదు కదా? అంటూ స్పందించారు. ఏదిఏమైనా అధికారులపై బాధ్యతపడడం వీరంతా తలలు పట్టుకుంటున్నారు.

గజిటెడ్ అధికారులు ఇప్పుడేం చేయాలి?

విశాఖ నగరంలోనైతే వార్డుల వారీగా సచివాలయాల వారీగా ఇప్పటికే గుర్తించిన వారిని ఒక్కో అధికారి కనీసం 1000 మందిని దత్తత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తాజాగా ఆదేశించారు. దీని ప్రకారం ప్రభుత్వ పథకాలు దీపం, రేషన్ కార్డులు, తల్లికి వందనం, రైతు భరోసా ఇలా ప్రభుత్వ పథకాలేవైతే అమలౌతున్నాయో అవి వారికి అందుతున్నాయో లేదో అన్న అంశంపై వీరంతా పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఇకపై బంగారు కుటుంబాలను గజిటెడ్ హోదా కలిగిన ఉద్యోగులు, ఆయా శాఖల అధిపతులు ఇలా తోడ్పాటునందించాల్సి ఉంటుందన్నది ఈ

మిగతా 2లో..

స్థాయీ సంఘ సమావేశంలో

రూ.31.03 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

జివిఎంసి స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘ సమావేశంలో అన్ని అంశాలు ఆమోదమైనట్లు మేయర్, స్థాయిసంఘం చైర్మన్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ. 31.03 కోట్లతో పలు అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం సభ్యులు ఆమోదించారని పేర్కొన్నారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్థాయీ సంఘం సభ్యులతో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాయీసంఘం చైర్మన్ మాట్లాడుతూ, స్థాయీసంఘం సమావేశంలో 60 ప్రధాన అజెండా అంశాలతో పాటు 33 టేబుల్ అజెండా అంశాలతో కలిపి మొత్తం 93 అంశాలను పొందుపరిచినట్లు తెలిపారు. స్థాయీ సంఘం

మిగతా 2లో..

వార్త మెయిన్‌లో...

తలసేమియా రన్‌ను ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి, కరణం మల్లేశ్వరి తదితరులు

తలసేమియాపై అవగాహనా రన్

'మిట్టల్'కు అదనపు భూసేకరణ చేపట్టొద్దు : రైతుల నిరసన ర్యాలీ

▶ వార్త మెయిన్ లో..

విశాఖలో మత్తు టాబ్లెట్లు స్వాధీనం

▶ వార్త మెయిన్‌లో..

ఎపి సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ పోటీలు ప్రారంభం

▶ వార్త మెయిన్ లో..

అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న ఐటిసి కంపెనీ యార్డు

ఐటిసి స్టాక్‌యార్డులో భారీ అగ్ని ప్రమాదం

వార్త మెయిన్‌లో..

జిఒ 36 ప్రకారం జీతాలు చెల్లించాలి

మున్సిపల్ కార్మికుల భారీ ప్రదర్శన

ర్యాలీ చేస్తున్న జివిఎంసి ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిఒ 36 ప్రకారం అన్ స్కిల్డ్‌కు రూ.21వేలు, సెమిస్కిల్డ్‌కు రూ.24,500 చెల్లించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, డెత్, రిటైర్మెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ జివిఎంసి ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు శనివారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ముందుగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సభ ఏర్పాటుచేసి, అక్కడి నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లారు. అనంతరం జివిఎంసి మేయర్, కమిషనర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరికిటి రాజు, జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, 2019 ఫిబ్రవరి 8న టిడిపి ప్రభుత్వం ఇచ్చిన జిఒ 96 ప్రకారం మినిమం టైమ్ స్కేలు వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి, నేటికీ అమలు చేయలేదన్నారు. జిఒ, పథకాలు అమలులో అన్యాయాలు జరుగుతున్నాయన్నారు. కమిషనర్ కల్పించుకొని ప్రభుత్వంతో మాట్లాడి ఈ నెల 21వ తేదీలోగా సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

కనీస వేతన చట్టం ప్రకారం ధరలకు అనుగుణంగా డిఎతో కూడిన వేతనం నిర్ణయించాలని, ప్రభుత్వ నిర్వచనం ప్రకారమే బేసిక్

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సంపన్నుల షాక్!

తాజా ఆదేశాల సారాంశం.

గతంలోనూ గ్రామాల దత్తత...

గతంలో చంద్రబాబు పాలనలో గ్రామాలను అధికారులు దత్తత చేసుకోవాలంటూ హుకుం జారీచేసిన సంగతి తెలిసిందే. జన్మభూమి, శ్రమదానం రోజులైతే అందరికీ తెలిసినవే. ఆ తర్వాత గ్రామాల దత్తత అధికార యంత్రాంగంపై నిర్దేశించగా తాజాగా అప్పుడే 'గ్రామాల దత్తత' విధానం సక్సెస్ కాలేదని, చతికిలపడిందంటూ శనివారం జివిఎంసి, కలెక్టరేట్‌లలో సీనియర్ అధికారుల మధ్య చర్చ నడిచింది. కుటుంబాలనే దత్తత తీసుకోవడం అంటే వారిని పేదరికం నుంచి రక్షించడానికన్న విధానం నుంచీ ప్రభుత్వ పథకాలు అందేలాగ ఈ కొత్త విధానం ఉండడం చూస్తే దీని వల్ల ఏం ఫలితాలు ప్రభుత్వం సాధిస్తుందని, 'పాత సీసాలో కొత్త సారా' తప్ప అన్నది సర్వత్రా వ్యక్తమవుతోంది.

రూ.31.03 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

సభ్యులు చర్చించి అన్ని అంశాలను ఆమోదించారని చెప్పారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి ఆశీలు వసూలు, అద్దెలు పొడిగింపు తదితర అంశాలను, ప్రజా ఆరోగ్య విభాగానికి సంబంధించి పలు అంశాలను సభ్యులు చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి ఇఎన్‌వి నరేష్ కుమార్, డిసి(ఆర్) ఎస్.శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్లు ఇప్పి నాయుడు, కె.శివప్రసాద్, ఎమ్.మల్లయ్యనాయుడు, బిఆర్ఎస్.శేషాద్రి, బి.హేమావతి, కార్యదర్శి బివి.రమణ, పర్యవేక్షక ఇంజినీర్లు గోవిందరావు, కె.శ్రీనివాసరావు, కృష్ణారావు, సంపత్‌కుమార్, కార్యనిర్వహక ఇంజినీర్లు, ఉపకార్య నిర్వాహక ఇంజనీర్లు, బయాలజిస్ట్ సాంబమూర్తి, ఎఎంఒహెచ్‌లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జిఒ 36 ప్రకారం జీతాలు చెల్లించాలి

రూ. 20 వేలు, ధరల పెరుగుదల ప్రకారం 33.67 శాతం డిఎ కలుపుకొని మొత్తం రూ.26,734 జీతం ఉండాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులతో పాటు పబ్లిక్ హెల్త్ కార్మికులు మొత్తం 45 వేల మంది కార్మికులకు ప్రభుత్వమే జిఒ 96 ప్రకారం వేతనాలు చెల్లిస్తే ఏడాదికి రూ.1678 కోట్లు మాత్రమే (పి.ఎఫ్, ఇఎస్ఐతో కలిపి) అవుతుందన్నారు. వైసిపి హయాంలో ఆప్కాస్‌లోని లోపాలను సరిదిద్దాలని, ఎంప్లాయి అన్న పదాన్ని తొలగించాలని కోరారు. 17 రోజుల సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని, జిఒ 25 ప్రకారం పబ్లిక్ హెల్త్ కార్మికులకు చెల్లించిన విధంగా సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాద మరణానికి రూ.5 లక్షలు చెల్లించాలని, జిఒ 12 ప్రకారం రూ.వెయ్యి చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ఎంవి.ప్రసాద్, జెఆర్.నాయుడు, జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్.కనకరాజు, వైస్ ప్రెసిడెంట్ మహేష్, ఉపాధ్యక్షులు గండి రమణ, కోశాధికారి కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పారా క్రీడలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నంలో ఆగస్టు 9వ తేదీన జరిగే పారా క్రీడలను విజయవంతం చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ హై పవర్ కమిటీ సభ్యులు డాక్టర్ బొడ్డేపల్లి రఘు విజ్ఞప్తి చేశారు. పోలీస్ బ్యారక్స్ గ్రౌండ్‌లో ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి 6వ జూనియర్, సబ్ - జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీల పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వి.రామస్వామి మాట్లాడుతూ, ఈ పారా అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనాలనుకునే క్రీడాకారులు ఈ నెల 28వ తేదీలోపు 9390131777 నంబర్‌ను సంప్రదించి, పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ శీతల్, గుంటూరు జిల్లా సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

డేటాప్రో మెగా రిక్రూట్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఐటి రంగంలో 35 సంవత్సరాల అనుభవంతో సేవలందిస్తున్న డేటాప్రో సంస్థ తన వార్షికోత్సవ సందర్భంగా శనివారం డైమండ్ పార్క్ సమీపంలోని కార్యాలయంలో భారీ ఉపాధి కార్యక్రమం నిర్వహించింది. వివిధ సాంకేతిక రంగాలకు చెందిన 20కు మించిన కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి, శాంతి చర్చలు జరపాలని, అటవీ సంపదను రక్షించి, పర్యావరణాన్ని కాపాడాలని పౌర ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎల్ఐసి సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి పెద్ద ఎత్తున శాంతియుత ర్యాలీ చేపట్టారు. ఎల్ఐసి కార్యాలయం, సంఘం శరత్ థియేటర్ జంక్షన్, ద్వారకా నగర్ మెయిన్ రోడ్డు మీదుగా ఆశీలు మెట్ట జంక్షన్, అక్కడి నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అక్కడ సభ నిర్వహించారు. పౌర ప్రజాసంఘాల వేదిక జిల్లా కన్వీనర్ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో నాయకులు మాట్లాడుతూ, దేశంలోని సంపదను స్వదేశీ, విదేశీ సంస్థలకు అమ్మి వేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకున్నాయని ఆరోపించారు. ఇందులో భాగంగానే ఛత్తీస్‌ఘడ్, ఇతర రాష్ట్రాలలోని అటవీ ప్రాంతాలలో ఉన్న ఆదివాసీలను తరిమికొట్టడానికి, వారికి అండగా ఉన్న మావోయిస్టు పార్టీని 2026 మార్చి 31 వరకు అంతం చేస్తామని ప్రకటించి 'ఆపరేషన్ కగార్' పేరుతో దారుణ మారణ కాండను జరుపుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా పరిపాలన సాగించకుండా రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మానవ హక్కులను హరిస్తోందన్నారు. మావోయిస్టులపై జరుపు తున్న దాడులను హోంమంత్రి అమిత్ షా తక్షణమే నిలిపివేసి, మావోయిస్టు పార్టీలతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎ.విమల, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, నాయకులు ఎస్.కె.రెహమాన్, వివిఎస్.కృష్ణ, వివి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న పౌరప్రజా సంఘాల నాయకులు

కెజిహెచ్‌లో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కెజిహెచ్ ప్రవేశ ద్వారం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడుతూ, కెజిహెచ్ శానిటేషన్ కాంట్రాక్టర్ శ్రీకృష్ణ కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడాన్ని ఆపాలన్నారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ కాంట్రాక్టర్ ప్రభుత్వంతో 2021 సంవత్సరంలో రూ.16 వేలు జీతం ఇస్తున్నట్లు ప్రభుత్వంతో రాతపూర్వకంగా ఒప్పందం చేసుకున్నా మూడేళ్లుగా రూ.11 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ చర్యను ఖండిస్తూ సిఐటియు కరపత్రాలు, ఆందోళన చేసిన ఫలితంగా వెయ్యి రూపాయలు పెంచి రూ.12 వేలు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నాడని విమర్శించారు. కలెక్టర్‌కు, కెజిహెచ్ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా, కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోలేదన్నారు. ఉద్యోగులను అకారణంగా తొలగిస్తున్నారని విమర్శించారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అయిన డిప్యూటీ కలెక్టర్‌ను కలిసి సమస్యపై మాట్లాడితే, తనకేం సంబంధం లేదని చెప్పడం అన్యాయం అన్నారు. కాంట్రాక్టర్ సక్రమంగా జీతాలు ఇవ్వకపోతే ప్రిన్సిపల్ ఎంప్లాయిర్‌గా కెజిహెచ్ సూపరింటెండెంట్ బాధ్యత, అయినప్పటికీ, ఇవేమీ పట్టించుకోకుండా కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు చేస్తున్నారని విమర్శించారు. కెజిహెచ్‌లో 275 మంది శానిటేషన్ సిబ్బంది ఉండాలని, కానీ 240 మంది మాత్రమే ఉండటంతో పని భారం పెరుగుతుందన్నారు. కెజిహెచ్‌కు ఛైర్మన్ అయిన కలెక్టర్ కూడా సమస్యలు పరిష్కరించడంలో చొరవ కూడా చూపడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎం.సుబ్బారావు సిఐటియు జోన్ కార్యదర్శి కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

25 నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 25వ తేదీ నుండి ఉచిత యోగా శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని యోగా టీచర్ పమిడిపాటి సావిత్రి తెలిపారు. ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, యోగా శిక్షణలో 10 సంవత్సరాల అనుభవం ఉందని, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం పిలుపుమేరకు ఈ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా బిపి, సుగర్, థైరాయిడ్, పిసిఓఎస్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు ప్రజల్లో అధికంగా ఉన్నాయని, దీనికి సరైన నివారణ యోగా అని తెలిపారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం ప్రతినిధి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో విపరీతంగా ఒత్తిడి ఉందని, దీని నివారణకు సరైన మార్గం యోగా అన్నారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ నాయకులు కెవిపి చంద్రమౌళి మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యం రక్షించుకోవడమే చాలా ఖరీదైందన్నారు. వ్యాధి రావడం కన్నా, నివారణే సరైన మార్గమని, దీనికి యోగా పరిష్కారం అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ నాయకులు ఎస్.కళాధర్ మరొక యోగా టీచర్ రామలక్ష్మి, మహిళా నాయకులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ : ఇంటాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటస్ ఫార్మాసిటికల్స్ లిమిటెడ్ సంస్థ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా హిమోఫిలియా వ్యాధిగ్రస్తులకు సిబిఎం కాంపౌండ్ సమీపంలోని సంస్థ కార్యాలయంలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అసోసియేట్ టి.సుజాత మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల ప్రజలకు ఆరోగ్యం, విద్య ఇతర రంగాల్లో సేవలందిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా తాము 40 ట్రాన్సిట్ హోమ్‌లను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వైజాగ్ బ్రాంచ్‌లో హిమోఫిలియా సొసైటీతో కలిసి వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. 21 మంది రోగులకు పరీక్షలు చేసినట్లు తెలిపారు. డాక్టర్లు సిహెచ్.విద్యావతి, జె.కె దీప్తి చంద్రికలు కౌన్సిలర్ డిఎస్ యశస్విని పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మాదక ద్రవ్యాలు తయారుచేస్తూ సమాజాన్ని విషగుండంగా మార్చుతున్న, కుటుంబాల ఆస్తులను జప్తు చేసి, జీవితాంతం జైల్లో ఉంచాలని ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ డిమాండ్‌చేశారు. ఇదే లక్ష్యంతో పనిచేస్తున్న, సంఘమిత్ర సూరిబాబు చేస్తున్న పోరాటం ఎంతో సమకాలీనమైనదన్నారు.

పోలీస్ సిబ్బందికి వాహనాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో విజువల్ పోలీసింగ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యాన అర్సెల్ మిట్టల్ నిప్పాన్ స్టీల్స్ ప్రయివేట్ లిమిటెడ్ సిఎస్ఆర్‌లో భాగంగా 25 అధునాతన మోటార్ సైకిళ్ళను అందించారు. శనివారం బీచ్ రోడ్‌లో కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ చేతుల మీదుగా ఈ వాహనాలను విశాఖ నగర పోలీసులకు పంపిణీ చేశారు.

పాస్‌పోర్ట్ పోయినది

నేను శీరంరెడ్డి మేఘన, తండ్రి శంకరరావు, నేను సీతయ్యపాలెం నుండి నర్సీపట్నం వెళ్ళుతున్న బండిపై ప్రయాణిస్తున్న సమయంలో, నా పాస్‌పోర్ట్ ఉన్న బ్యాగ్ పోయినది.
పాస్‌పోర్ట్ నెంబర్. **Y7320501**
దయచేసి, ఈ పాస్‌పోర్ట్ దొరికిన వారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.
శీరంరెడ్డి మేఘన సీతయ్యపాలెం గ్రామం, నర్సీపట్నం మున్సిపాల్టీ & మండలం, అనకాపల్లి జిల్లా.
సెల్ నెం. 93911 78199

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారి కోర్టులో, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు
ఓ.యస్.నెం.102/2018

బిట్వీన్:
ఘంటా గంగాధరరావు ...ప్లెయిన్‌టిఫ్/వాది
మరియు
లక్కోజు రాధాకృష్ణ మరియు ఇతరులు ...డిఫెండెంట్స్/ప్రతివాదులు

టు
డిఫెండెంట్-7 : లక్కోజు కిషోర్, S/o.(లేటు) ఆచారి, టైప్-3, బ్లాక్-13/118, పోర్టు కోటర్స్, సాలగ్రామపురం, విశాఖపట్నం, విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు దావాలో 7వ డిఫెండెంట్ అయిన మీకు నోటీసు అమలు నిమిత్తము తేది.**31-07-2025**న వాయిదా అయివున్నది. సదరు 7వ డిఫెండెంట్‌కు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల ది.**31-07-2025**వ తేదీ ఉదయం 10.30 నిమిషములకు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ పైకోర్టు నందు హాజరు అవ్వవలెను. లేనియెడల మీ పరోక్షమున కోర్టు వారు ఆర్డరు తీర్మానించబడును. అని తెలియపర్చడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము

N.Y.VPRASAD,
G.SANJAY BABU
Advocates, Eluru.
Cell: 9985424304

స్థలము: ఏలూరు
తేది.19-07-2025

In the Court of the Hon'ble Junior Civil Judge at Prathipadu
O.S. No. 159/2024

Between:
Peyyala Nookaraju ***...Plaintiff***
AND
Talluri Subbalakshmi ***...Defendant***

To:
Talluri Subba Lakshmi, W/o. (late) Lovaraju, aged 38 years, House wife, resident of Door No. 17-41/1, Muslim Street, Payakaraopeta Village, Payakaraopeta Mandal, Anakapalli Dist.,

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 13-8-2025వ తేదీ గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.సూర్యప్రకాశరావు, అడ్వకేట్
ప్రత్తిపాడు, సెల్: 8328346942

మహారాజశ్రీ గాజువాక 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A.No. 74 / 2025 in O.S. 60 / 2008

బిట్వీన్:
విలేజ్ గాడెస్స్ బంగారమ్మ దేవుని మాన్యము Rep. by its ప్రెసిడెంట్ మరియు ఇతరులు . . . పిటిషనరు / ప్రతివాది
మరియు:
కాటూరి విజయశ్రీ ... రెస్పాండెంట్/వాది

నోటీసు

టు: కాటూరి విజయశ్రీ భర్త ఆడాయ్స్, క్రిస్టియన్, వయస్సు 46 సం॥లు, నివాసము డో.నెం. 32-10-9, శీలానగర్, బి.హెచ్.పి.వి.పోస్ట్, విశాఖపట్నం-12.

పై నెంబరు గల కేసులో విలేజ్ గాడెస్స్ బంగారమ్మ మాన్యము Rep. by its ప్రెసిడెంట్ మరియు ఇతరులు IA 74/2025 నందు డాక్యుమెంట్లను Receive చేసుకోమని పిటిషన్ వేసి ఉన్నారు. కాగా సదరు పిటిషన్‌లో శ్రీ కోర్టు వారు మీ హాజరు కొరకు **తేది:31-07-2025కి** వాయిదా వేసినారు. కావున పై దినమున మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గాని **ఉదయం గం. 10-30ని॥లకు** పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలను తెలుపవలెను. లేనియెడల పై కేసులో హాజరై మీ ఆక్షేపణలను తెలుపవలెను. లేనియెడల పై కేసులో మీ పరోక్షమున తీర్మాణించబడునని తెలియజేయడమైనది.

(By Order of the Hon'ble Court
B.YASODHARA VEDAMANI
K.V.RAMANA, Advocate
Gajuwaka, Visakhapatnam.
Cell : 9246621519, 9248809471

పలుచోట్ల స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి- ఆనందపురం : పర్యావరణ పరిరక్షణ, మానవాళి మనుగడకు ప్లాస్టిక్ అంతమే ప్రతిఒక్కరి బాధ్యత కావాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.. శనివారం బంటుపల్లి రామాలయం వద్ద ప్లాస్టిక్ నిర్మూలన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. రామాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి షేక్ షమ్ము, సర్పంచ్ కోన పైడిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, బంటుపల్లి శ్రీనివాసరావు, బీఆర్‌బి నాయుడు, వరప్రసాద్, లోడగల వెంకట్రావు పాల్గొన్నారు.

సీతమ్మధార : ప్రతీనెలా మూడవ శనివారం పరిసరాల పరిశుభ్రతకు కొంత సమయం కేటాయించి స్వచ్ఛాంధ్రకు సహకరించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ .పి.జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. మధురవాడ పిహెచ్‌సి వద్ద సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ .బాలాజీ, స్వచ్ఛాంధ్ర నోడల్ అధికారి డాక్టర్.దీపిక, డాక్టర్ ప్రశాంతి, గెడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధురవాడ :జివిఎంసి 7వ వార్డు వాంబే కాలనీ ప్రభుత్వ హాస్పిటల్, అన్నా క్యాంటీన్ వద్ద వార్డు కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ నిర్వాహక కార్యదర్శి పిళ్ళా వెంకటరావు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కానూరి అచ్యుత్, నాగోతి శివాజీ, పిల్లా మోహన్‌కృష్ణ, లొడగల భవాని, కాంతం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో ప్లాస్టిక్ అనర్థాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా, విజేతలకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. జెడ్‌పిటిసి గాడు వెంకట ప్పడు, డిపిఒ ఎం శ్రీనివాసరావు, డిఎల్‌పిఒ నిర్మలా దేవి, ఎంపిడిఒ కె నరసింహారావు, తహశీల్దార్ పైలా రామారావు, ఇఒపిఆర్‌డి కె.రమేష్‌నాయుడు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులుపాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణను శుభ్రపరిచారు కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ విష్ణుమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.
జివిఎంసి ఒకటో వార్డు తగ రపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో ప్రిన్సిపల్ డాక్టర్ పి శ్రీ వాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తగరపువలస : చిప్పాడ దివీస్ అధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో తూడెం జెడ్పి హైస్కూల్ విద్యార్థులు, దివీస్ ఉద్యోగులు, సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్, ప్రతినిధులు నరసింహ, శేఖర్, పాల్గొన్నారు

సీతమ్మధార : స్థానిక రైతుబజారులో ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పాలిథిన్ కవర్లు వాడొద్దని, గుడ్డ, నారసంచులు వాడాలని కోరుతూ వినియోగదారులకు అవగాహన కల్పించారు. జివిఎంసి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్రలో ఎస్ఐ వెంకటరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : 13వ వార్డులో జిఎంసి శానటరీ విభాగం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ పాల్గొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, కూటమి నాయకులు సంజీవరావు, అడ్డూరి రమణ, ఆనందరావు, పైడిరాజు పాల్గొన్నారు. 12వవార్డు శానటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీలో వార్డు టిడిపి అధ్యక్షులు గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు, బసవ దేవుళ్ళు పాల్గొన్నారు.

ఆనందపురంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గంటా

సబ్బవరం : పరిసరాలు పరిశుభ్రత ప్రతి ఒక్కరీ బాధ్యత అని ఎపి కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవెర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి అన్నారు.మొగలిపురం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా శ్రమదానం చేశారు. మొక్కలు నాటారు. ప్రతిజ్ఞ చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో ఎంఈఓ ఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రపరిచారు. టిడిపి నాయకులు గండి వంశీ దీప్, గండి ముత్యాల నాయుడు, భరణికాన సాయినాథరావు, బోండా సత్యారావు, సర్పంచ్ గండి అరుణ, ఎంపిటీసీ తమరాన బంగారు నాయుడు పాల్గొన్నారు.

వడ్డాది : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు పిలుపునిచ్చారు. వడ్డాది బంగారు మెట్టలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోజీరావు ఈఓఆర్డీ విజయలక్ష్మి. హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కోవెల వెంకటరమణ పాల్గొన్నారు.

అనకాపల్లి : 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పోలీసు సిబ్బంది శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణం, వాహనాల పార్కింగ్ స్థలాలు, రికార్డు గదులు, ఇతర ప్రదేశాలను శుభ్రం చేశారు. చెత్తను తొలగించారు. మొక్కల చుట్టూ కలుపు తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు బాల సూర్యరావు, లక్ష్మి, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య, అంజిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లి మండల కేంద్రంలో మండల స్పెషలాఫీసర్, డిడిఓ మంజుల వాణి నేతృత్వంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పంచాయతీ పరిధిలోని ప్రతి షాపుకు వెళ్లి ప్లాస్టిక్ వినియోగంపై తీవ్ర హెచ్చరికలు చేశారు. అనంతరం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించి, నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : ఎంవిపి రైతుబజార్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రచారం, అవగాహనా కార్యక్రమం చేపట్టారు. రైతు బజార్ ఎస్టేట్ అధికారి కె.వరహాలు పాల్గొన్నారు.

జివిఎంసి ఆధ్వర్యాన ఎండాడ జంక్షన్ వద్ద ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర నిర్వహించారు. విశాఖ కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, విశాఖ నగరంలో ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలన్నారు. పర్యావరణహితమైన ప్రత్యామ్నాయ వస్తువులనే వినియోగిస్తూ విశాఖ నగర పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి , 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు , పాల్గొన్నారు.

కలెక్టరేట్ : కింగ్ జార్జ్ ఆసుపత్రిలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీని సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ఆధ్వర్యాన నిర్వహించారు. మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కె.రాజ్ కుమార్ పాల్గొన్నారు. మహారాణిపేటలోని సమాచార శాఖ కార్యాలయంలో ఉద్యోగులు ప్లాస్టిక్ వస్తువులను తొలగించి, పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. సమాచారశాఖ ఉప సంచాలకులు కె. సదారావు, సహాయ సంచాలకులు డి.రమేష్ సారథ్యంలో సామూహిక ప్రతిజ్ఞ చేశారు. డివిజనల్ పిఆర్ఒ నారాయణరావు, ఎపిఆర్ఒ శ్రీనివాసరావు, ఎవిఎస్ వెంకటరావు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలం ఏఎల్.పురంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ చేశారు. సర్పంచ్ లోచల సుజాత, టీడీపీ నాయయకులు జమీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. సాలికమల్లవరం పంచాయతీలో శనివారం పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద స్వర్ణంద్ర కార్యక్రమంను నిర్వహించారు. సాలిక మల్లవరం మాజీ సర్పంచ్ కొల్లాన కొండలరావు, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు పెదిరెడ్ల మల్లేశ్వరరావు, సర్పంచ్ నూకరత్నం, బూత్ కన్వీనర్ ఇంద శ్రీను, కోశాధికారి కసవరాజు ప్రసాద్, పెదిరెడ్ల సత్యంపాల్గొన్నారు.

కోటవురట్ల: మండల కేంద్రంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు లింగన్న నాయుడు సచివాలయం వద్ద కార్యక్రమంలో నిర్వహించారు.

మాడుగుల:మాడుగుల బస్ స్టాండ్ లో ప్లాస్టిక్ నిర్మూలనపై ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, టిడిపి టౌన్ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీ నారాయణ, జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి రొబ్బ మహేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు శ్రీనాథ్ శ్రీనివాసరావు, పిఎస్ నాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ:కృష్ణదేవిపేట జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎస్సై వై.తారకేశ్వరరావు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి శివప్రసాద్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ ఓ నాకరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో వీవీ రమణ ఆధ్వర్యంలో కార్యాలయం ప్రాంగణంలో క్లీన్ అండ్ గ్రీన్ చేశారు.

నేరాలు ఘోరాలు

గడ్డి మందు తాగిన ఇద్దరు యువకులు మృతి

- కణమాం, ఆకులవారి కల్లాలులో విషాదం

జి.శంకరరావు, మహరాజ్‌కుమార్ (ఫైల్)

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో గడ్డి మందు తాగి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటనలు స్థానికంగా విషాదాన్ని నింపింది ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిళ్లకు తట్టుకోలేక ఈ దారుణానికి ఒడిగట్టగా, ఆసుపత్రులోల చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. వివరాలివి.
బంటుపల్లి గ్రామ పంచాయతీఆకుల వారి కల్లాలకు చెందిన గొర్రె శంకరరావు (30) ఈ నెల 14న గడ్డి మందు తాగాడు. అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు కొమ్మాది గాయత్రి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. గతంలోనూ మానసిక ఒత్తిడితో శంకరరావు గడ్డి మందు తాగాడు. గొర్లి కృష్ణకు ముగ్గురు సంతానంలో మృతుడు శంకరరావు చిన్నవాడు.
మండలంలోని కణమాం గ్రామంలోనూ ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహారాజ్ కుమార్ (24) ఈనెల 12న సాయంత్రం 7 గంటల సమయంలో గ్రామ సమీపంలోని కొండ ప్రాంతానికి వెళ్లి గడ్డి మందు తాగాడు. స్థానికుడు లక్ష్మణరావు అతన్ని గుర్తించి, వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 3 గంటలకు మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రెండు ఘటనలు చోటుచేసుకోగా, ఆయా గ్రామాల్లో విషాదం నెలకొంది.రెండు ఘటనలపై అందిన ఫిర్యాదుతో సిఐ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎఎస్ఐ సత్తిబాబు, హెచ్‌సి వెంకటరావు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీలో మోటార్ సైకిల్ దొంగను టౌన్ పోలీసులు శనివారం పట్టుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ గోవిందరావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, మే నెల 8న బలిఘట్టం మరిడమ్మ తల్లి పండగ సంధర్భముగా సుర్ల లోవరాజుకు చెందిన హీరో గ్లామర్ మోటార్ సైకిల్ చోరీ జరగడంతో ఇచ్చిన పిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించామన్నారు. శనివారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడు షేక్ బషీర్ భాష ను విచారణ చేయడంతో చోరీకి గురైన మొత్తం ఆరు బైక్లు బయట పడ్డాయన్నారు. దీంతో రిమాండ్‌కు తరలించామన్నారు.

మెడిటేషన్‌తో ఏకాగ్రత

ప్రజాశక్తి -గాజువాక : మెడిటేషన్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని, రామకృష్ణ మిషన్ శ్రీకృష్ణ శాఖానంద స్వామీజీ అన్నారు. శనివారం గాజువాక ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో ఎథిక్స్ అండ్ మొరాలిటీపై నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ, జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే మెడిటేషన్, కంప్రెషన్ అలవాటు చేసుకోవాలన్నారు. మెడిటేషన్‌తో ఏకాగ్రత పెరగ్గా, కరుణతో క్రమశిక్షణ గల పౌరులుగా ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా స్వామీజీని సత్కరించారు.కార్యక్రమంలో కళాశాల, కరెస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.బాలకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరరాజు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసిసిబి చైర్మన్‌కు అభినందన

ప్రజాశక్తి- గాజువాక : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) చైర్మన్ కోన తాతారావును శనివారం ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేవుడు ఆధ్వర్యంలో ఉద్యోగులు కలిసి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టిల స్వయంఉపాధి, వ్యాపారాలను ప్రోత్సాహించేందుకు బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై చైర్మన్ తాతారావు స్పందిస్తూ నిజాయితీగా వ్యాపారాలు చేసే ప్రతికుటుంబానికి బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకే రుణాలిచ్చి సహకరిస్తామన్నారు. కంచిపాటి ప్రకాష్, ముద్రగడ శ్వేత, టెక్కలి భాస్కరరావు ఉన్నారు.

ప్లాస్టిక్ తయారీ యూనిట్ల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-మాధవధార : ఎపి కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య శనివారం విశాఖపట్నం ఆటోనగర్‌లోని ప్లాస్టిక్ తయారీ యూనిట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నవీన్ సాయి ప్లాస్టిక్స్, ప్రగతి ప్రింట్ పాక్స్ వంటి యూనిట్లను పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్రలో కాలుష్యానికి హాని కలిగించే వ్యర్థాలను తొలగిస్తున్నామన్నారు. ప్రజలకు హాని చేసే వ్యర్థాలను తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని డాక్టర్ కృష్ణయ్య కోరారు. ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి వెంకట ముకుందరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం దూరం

ప్రజాశక్తి-ములగాడ : నిరుపేదలకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందంఉందని నవజీవన్ డాన్‌బాస్కో ఫాదర్ అరుల్‌దాస్ అన్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, విద్యతోనే పేదరికం నుండి బయట పడగలమని, బాగా చదువుకుని, నైపుణ్యాలను పెంచుకొని, ఉపాధిని పొంది, జీవన ప్రమాణ స్థాయిని పెంచుకోవాలన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాల సిస్టర్ కాస్లిన్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి కాలేజీ విద్యార్థులు నిధులను సమీకరించాలన్నారు. తాము బాగా చదువుకోవడంతోపాటు పేదల పిల్లల చదువుకు చేయూతనివ్వాలన్నారు. అనంతరం మురికివాడల్లోని నవ జీవన్ డాన్ బాస్కో ఉచిత ట్యూషన్ సెంటర్లకు నగదు సహాయాన్ని అందజేశారు. వృద్ధులకు దుప్పట్లు, మహిళలకు చీరలు, చిన్నారులకు మిఠాయిలు పంచారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ ఆన్స్ సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయాదేవి , అధ్యాపకులు డాక్టర్ ప్రశాంతి, అంకిత, జ్యోత్స్న పాల్గొన్నారు. విద్యార్థినులు ఆటపాటలతో అలరించారు.

మంచినీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : వార్డు పరిధిలో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని 72వ వార్డు కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ అన్నారు. శనివారం చినగంట్యాడ న్యూ ఎస్‌సి కాలనీలో మంచినీటిబోరును ప్రారంభించారు వార్డులో రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్స్, పార్కుల అభివృద్ధితోపాటు తాగునీటి సౌకర్యం కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. వార్డు టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ఎ.లక్ష్మణరావు, సి.హెచ్. కన్నారావు , సిపిఐ కార్యదర్శి జి.ఆనంద్, అప్పారీ విష్ణుమూర్తి,కొల్లి దేముడు, ఈశ్వరరావు, మండే సత్యనారాయణ, రాజు, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు .

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న రాష్ట్ర సమాచార కమిషనర్

జ్ఞాపిక, ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్నను శనివారం రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ దర్శించుకున్నారు. ఆయనను ఆలయ కార్యనిర్వహణాధికారి. వేంద్ర త్రినాధరావు ఆహ్వానం పలుకగా, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యులు ఆధ్వర్యంలో కప్పస్తంభం, ఆలింగనం, బేడా మండపం ప్రదక్షిణ, స్వామి అంతరాయంలో ప్రత్యేక పూజలు అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు అందజేయగా, ఇఒ త్రినాధరావు జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. ఎఇఒ తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి జివిఎస్‌కె.ప్రసాద్, పిఆర్‌ఒ నాయుడు పాల్గొన్నారు.

ప్రోత్సాహంతో క్రీడల్లో రాణింపు

ప్రజాశక్తి-మధురవాడ : క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి, తగిన ప్రోత్సాహం అందిస్తే మరింతగా రాణిస్తారని విజ్జిస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తలశిల విజయమోహన్ అన్నారు. కొమ్మాది శివారు క్రీడా మైదానంలో జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీ, కె1, కె2 కాలనీలకు చెందిన 100మంది విద్యార్థులకు ఫౌండేషన్ల ఆధ్వర్యంలో బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయమోహన్ మాట్లాడుతూ, పేద క్రీడాకారులకు తమ ఫౌండేషన్ ప్రోత్సహిస్తోందని, వారికి ప్రత్యేకంగా ఫుట్‌బాల్ మైదానం నిర్మించామన్నారు.కార్యక్రమంలో ఉప్పరయ్య, అవతార్‌సింగ్, యామిని, రాబియా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు నగర శివారు ప్రాంతమైన దారపాలెంలో శనివారం పలు అభివృద్ధి పనులకు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. వార్డు పరిధి అల్లూరి సీతారామరాజు వ్యాలీ, బంగారు తల్లి నగర్, సింహాద్రి లే అవుట్‌లో జివిఎంసి నిధులు రూ.2.79 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెలగపూడి మాట్లాడుతూ త్వరలో దారపాలెంలోని రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలిపారు. వార్డు టిడిపి అధ్యక్షుడు పొత్రకండ ధర్మారావు, కార్యదర్శి యల్లమిల్లి సురేష్, మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, నల్లాని వరలక్ష్మీ పాల్గొన్నారు.

త్వరలో ఆశాల సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : త్వరలో జిల్లాలోని ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ పి జగదీశ్వరరావు అన్నారు. శనివారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో త్రైమాసిక సమావేశం నిర్వహించి, వారి సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ, ఆశాల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు మూడు నెలలకోసారి వారికి గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. వారి నుంచి వినతులు స్వీకరించి, జిల్లా స్థాయి సమస్యలను ఇక్కడే పరిష్కరించి, రాష్ట్ర స్థాయి సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆశాలు బాగా పనిచేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు జిల్లా ప్రగతికి పాటుపడాలన్నారు. ఎం.సత్యవతి, డిపిహెచ్‌ఎన్ఒ మణికుమారి, డిసిఎం పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా ప్రసాద్

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ అర్బన్ సీతమ్మధార తహశీల్దార్‌గా ఎంవివి.ప్రసాద్ శనివారం కార్యాలయంలో ఉద్యోగబాధ్యతలు స్వీకరించారు. అరకులో భూసంరక్షణ విభాగం తహశీల్దార్‌గా విధులు నిర్వర్తించిన ప్రసాద్, ఇటీవల బదిలీల్లో సీతమ్మధార తహశీల్దార్‌గా నియమించగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, అన్ని విధాలుగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డిటి త్రినాధ్, ఆర్ఐలు,విఆర్ఒలు కొత్త తహశీల్దార్‌ను స్వాగతించి, శుభాకాంక్షలు తెలిపారు.

మేధకు పదును చదరంగం

ఎంవిపి కాలనీలోని ఎస్3 స్పోర్ట్స్ ఎరీనాలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ ఓపెన్ చెస్ టోర్నీ (ఫైల్)

- విశాఖలో చెస్‌కు పెరుగుతోన్న ఆసక్తి
- తర్ఫీదునిస్తూ ప్రోత్సాహిస్తున్న అకాడమీలు
- పలువురు కోచ్‌లకు జీవనోపాధిగా నేడు ఈ క్రీడ
- నేడు వరల్డ్ చెస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం

విశాఖ మహానగరంలో చదరంగం క్రీడకు నానాటికీ ప్రజాదరణ పెరుగుతోంది. మేధస్సుకు సంబంధించిన ఈ క్రీడలో అంతర్జాతీయ, జాతీయస్థాయి క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని, చిరుప్రాయం నుంచే ఎందరో చెస్ పట్ల మక్కువ చూపుతూ నేర్చుకుంటున్నారు. అనేకమంది తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఈ క్రీడకు ప్రోత్సాహిస్తుండడం విశేషం. దీనికి అనుగుణంగా నగరంలోనూ ఇటీవల కాలంలో పలు చెస్ అకాడమీలు వెలిశాయి. 'ప్రతి కదలిక లెక్కించబడుతుంది... బోర్డులో, జీవితంలో.. ప్రతి నిర్ణయం మన ప్రయాణాన్ని నిర్దేశిస్తుంది..మనకు గుర్తు చేస్తుంది' థీమ్‌తో ఈ ఏడాది ప్రపంచ చెస్ దినోత్స వాన్ని ఈనెల 20న ఫీడే నిర్వహిస్తోంది. ఈ నేపథ్యం లో నగరంలో చదరంగం క్రీడ, క్రీడా అకాడమీలు, ఔత్సాహిక క్రీడాకారులు స్థితిపై ఒక లుక్కేద్దాం...

(ప్రజాశక్తి- విశాఖపట్నం)

మొట్టమొదటిగా చదరంగం పుట్టింది మన భారతదేశంలోనే. సుమారు 1500 సంవత్సరాల క్రితం చదరంగం ఉద్భవించింది. అప్పట్లో 'చతురంగ' అని పిలిచేవారు. 6వ శతాబ్దంలో గుప్త రాజవంశం కాలంలో దీనిని గుర్తించారు. చతురంగ అంటే అర్థం సైన్యంలోని నాలుగు భాగాలు అని. అవి: పదాతిదళం, అశ్విక దళం, గజదళం, రథాలు. భారత్ నుంచి పర్షియాకు వ్యాపించిన ఈ క్రీడను అక్కడ 'శత్రుంజ' అని పిలిచేవారు. అటుతర్వాత స్పెయిన్, ఇటలీ ద్వారా ఐరోపాకు విస్తరించింది. కాలక్రమేణా ఆటల్లోనూ, నియమాల్లోనూ చోటుచేసుకున్న మార్పులతో మనదేశంలో చదరంగంగా నామసార్థకత చేసుకుంది. భారతదేశంలో చదరంగం ఇప్పటికీఎంతో ప్రాచుర్యం పొందిన ఆట, విశ్వనాథన్ ఆనంద్ నుండి నేడు గూకేష్ వరకు భారత్‌ను ప్రపంచ ఛాంపియన్‌గా నిలబెట్టారు.నేడు ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చెస్ టోర్నమెంట్లు జరుగుతున్నాయి. ఆంధ్ర చెస్ అసోసియేషన్‌కు అనుబంధంగా విశాఖలోనూ చదరంగం క్రీడ దినదినాభివృద్ధి సాధిస్తోంది. అధికారికంగా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లు తరచూ నిర్వహిస్తుండడంతో ఈ క్రీడ పట్ల నగర వాసుల్లో ఆసక్తి, అభిరుచి పెరుగుతోంది. ఇపుడు నగరంలోనే అనేక పాఠశాలల్లో ఈ క్రీడ ఒక భాగంగా మారింది. ఒకప్పుడు నాలుగైదు అకాడమీలు నామమాత్రంగా ఉండే విశాఖ నగరంలో, నేడు 35 చెస్ అకాడమీలు పోటాపోటీగా నడుస్తున్నాయి. ఇపుడు కోచ్‌లకు చదరంగం క్రీడ ఒక జీవనోపాధిగా మారిందంటే అతిశయోక్తి కాదు. క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలతో తీర్చిదిద్దుతూ, మరికొందరికి స్ఫూర్తిగా, ప్రేరణగా నిలవడం ద్వారా నగరంలో చెస్ క్రీడ మరింతగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తున్నారు.

చిన్నారుల్లో చెస్‌పై పెరుగుతోన్న ఆసక్తి

మూడేళ్ల క్రితం అండర్ -7 విభాగంలో విశాఖ నగరంలో వేలిపై లెక్కపెట్టేంతగా పదిమంది లోపే ఉన్న చిన్నారి చెస్ క్రీడాకారులు, ఇపుడు 110 మందికి పైబడి ఉన్నారు. ఈ ఏడాది అండర్ -7విభాగంలో బాలురులో ఛాంపియన్ ధనుష్ పిల్ల. బాలికలలో దియా తేజశ్రీ బుద్ద నిలిచారు. నగరంలో నేడు ఏ టోర్నమెంట్ పెట్టిన 250 నుండి 300 వరకు క్రీడాకారులు పోటీపడుతున్నారు. ఇది ఆంధ్ర చెస్ అసోసియేషన్‌కు అనుబంధంగా విశాఖ చెస్ అసోసియేషన్ పట్టుదల, కృషికి నిదర్శనమని ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రంగాల బాబూరావు సగర్వంగా చెబుతున్నారు.

చెస్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణలో విశాఖ ఎంపీ శ్రీభరత్‌తో ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు

నగరంలో విశేషంగా వెలసిన చెస్ అకాడమీలు

విశాఖ చెస్ అసోసియేషన్‌కు సహకరించి, దానికి అనుబంధంగా నేడు శ్రీ చెస్ అకాడమీ, చైతన్య చెస్ అకాడమీ, క్యాండిడ్ నైట్స్ చెస్ అకాడమీ, ఆదిత్య చెస్ అకాడమీ, ఆచార్య చెస్ అకాడమీ, మైండ్ మాస్టర్స్ చెస్ అకాడమీ, అన్ని అకాడమీలు అధినేతలు, చెస్ క్రీడాకారుల పేరెంట్స్ పనిచేస్తున్నారన్నారు. వీరందరి సేవ చేయాలనే దృక్పథంతో 15 జాతీయ టోర్నమెంట్లలో పాల్గొన్న ఆటగాడిగా, చెస్ ప్లేయర్స్, కోచ్‌లను తయారు చేసిన కోచ్‌గా, పేరెంట్ గా, టోర్నీ ఆర్గనైజర్, డైరెక్టర్‌గా తాను చేస్తున్న కృషికి అందరి నుంచి సహకారం లభిస్తోందని డాక్టర్ బాబూరావు అంటున్నారు.అందుకే ఎసిఎ, ఎఐసిఎఫ్ అనుమతితో మూడేళ్లలో ఐదు ఇంటర్నేషనల్ చెస్‌టోర్నీలను విశాఖలో నిర్వహించగలిగామంటున్నారు. తనకు టోర్నీల నిర్వహణలో ఆల్‌విశాఖ చెస్ అసోసియేషన్ శ్రీకాంత్, మణికంఠరావు, ఉమామహేశ్వరరావు, చిరంజీవి,కోచ్‌లు జివి.కుమార్, ప్రశాంత్ కోసూరు, రామకృష్ణ సహకరిస్తున్నారని బాబూరావు తెలిపారు.

ఇప్పుడు విశాఖలో ఇంటర్నేషనల్ ఫిడే ఓపెన్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ పెడితే 500 నుంచి 600 ఆటగాళ్లు పోటీ పడే స్థాయికి విశాఖలో చదరంగం క్రీడ అభివృద్ధి చెందిందని అంటున్నారు. ఒకపుడు చదరంగం నేర్చుకోవాలంటే ఆసక్తి ఉన్న క్రీడాకారులు జిల్లా, రాష్ట్రం దాటి ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి నుంచి నేడు జిల్లాలోనే అనేక అకాడమీలు చెస్‌లో వివిధ విభాగాల్లో తర్ఫీదునిస్తున్నాయి. ఇప్పటికే చదరంగంలో ఒకస్థాయిలో ఉన్న విశాఖ నగరం, భవిష్యత్‌లో మరింత పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షిద్దాం.

బదిలీ స్థానాలకు పంపించండి

- ఆర్‌జెడికి హిందీ పండితుల వినతి

వినతిపత్రం ఇస్తున్న హిందీ పండితులు, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి భీమునిపట్నం : సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో సుమారు 65 మంది హిందీ పండితులు బదిలీ అయినప్పటికీ పాత పాఠశాలల్లోనే పని చేయాల్సి రావడంతో మానసికంగా ఆవేదన చెందుతున్నారని, బదిలీ అయిన పాఠశాలలకు పంపించాలని హిందీ పండితులు ఆర్‌జెడికి శనివారం వినతి పత్రం అందజేశారు. బదిలీల కౌన్సిలింగ్‌లో 183 మంది హిందీ ఉపాధ్యాయులు వివిధ ఉన్నత పాఠశాలల నుంచి దరఖాస్తులు చేసుకున్నారని, ఇందులో 136 మందికి కోరుకున్న చోటకు బదిలీలు జరిగాయన్నారు. ప్రభుత్వం 50 శాతం నిబంధన పెట్టడం వల్ల హిందీ పండితులకు నష్టం జరిగిందన్నారు. ఇప్పటికైనా బదిలీ అయిన కొత్త పాఠశాలలకు పంపించి, ఖాళీ అయిన స్థానాల్లో ప్రత్యామ్నాయంగా వాలంటీర్లను నియమించాలని కోరారు. ఆర్‌జెడికి వినతిపత్రం అందజేసిన వారిలో పండిత పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై దయానంద, టిఎస్‌వి ప్రసాదరావు, యుటిఎఫ్ నాయకులు ఉన్నారు

14 మందికి నియామక పత్రాలు

పోస్టింగ్ ఆర్డర్స్ ఇస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పలు పోస్టులను భర్తీ చేసి, ఎంపికైన 14 మందికి శనివారం నియామక పత్రాలను జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు అందజేశారు. డిసెంబర్‌లో వేసిన నోటిఫికేషన్ ప్రాప్తికి ఎంపికైన వారికి శనివారం కౌన్సెలింగ్ నిర్వహించి, పోస్టింగ్ ఆర్డర్స్ అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్ మూడు పోస్టులు, ఎఫ్ఎన్ఒలు ఐదుగురు, ఎస్ఎడబ్యులు ఆరుగురు మొత్తంగా 14మందికి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, క్రమశిక్షణతో పనిచేసి,ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించి, మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఎఒ విజయ్ కుమార్, డెమో నాగేశ్వరరావు, సిసి నాగభూషణం పాల్గొన్నారు.

110 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు సంగివలస లక్ష్మీ విజయ మెడికేర్ హాస్పిటల్ వద్ద శనివారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 110 మందికి కంటిపరీక్షలు చేసి వారిలో 35 మందికి కేటరాక్ట్ సర్జరీ అవసరమని నిర్ధారించారు.

రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రామభద్ర రాజు, దీపక్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి, క్యాంప్ కోఆర్డినేటర్ రాజు పాల్గొన్నారు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వార్వా, నివాస్ నాయకులు

ప్రజాశక్తి- గాజువాక

స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం రద్దు చేయాలని జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ ఎం రమేష్‌కుమార్ అన్నారు. వార్వా, నివాస్, వాయిస్ ఆఫ్ గాజువాక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ డాక్టర్ రమేష్‌కుమార్ ఇంటిపై శనివారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని కోరుతూ, పోస్టర్లను ఆవిష్కరించారు. వార్వా గాజువాక నాయకులు కె. కిరీటం మాట్లాడుతూ, ఆదాని కంపెనీతో ఒప్పందాన్ని రద్దుచేసి, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును మానుకోవాలన్నారు. సిఐటియు గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి ఎల్ బంగారునాయుడు మాట్లాడుతూ, స్మార్ట్‌మీటర్ల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండి వ్యతిరేకించకుంటే భారం మోయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వరి వెంకటరావు, కె.వి రమణ, కె.త్రినాధస్వామి, ఆర్ నారాయణరావు పాల్గొన్నారు.

ములగాడ : అదాని స్మార్ట్ మీటర్లు ఏర్పాటును వ్యతిరేకించాలని పిలుపునిస్తూ జివిఎంసి 61వ వార్డు మల్కాపురం ప్రాంతంలోసిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించింది. ఇంటింటాకరపత్రాలు పంచుతూ, స్టిక్కర్లను అతికిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. పాదయాత్రలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు ఉరుకూటి బాబురావు, ఎన్ ఉమా విజయ, వెంకటేష్, బంగారురాజు, సిపిఎం కార్యకర్తలు జి.నరేష్, ఎస్.వాసు, సమీన్, నీలయ్య, లండరాజు, గంట దాసు, కోటి పాల్గొన్నారు.

మాల్కాపురం ప్రాంతంలో పాదయాత్ర నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు

తగరపువలస : స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిఆర్ భవన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఏరియా సమితి కార్యదర్శి కానూరు రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు మాట్లాడుతూ, స్మార్ట్ విద్యుత్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈనెల 19 నుంచి వచ్చేనెల 5 వరకు సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టే నిరసనల్లో పాల్గొన్నాలన్నారు. కార్యకర్తలను కోరారు. పార్టీ నాయకులు ఎం వీర్రాజు, లక్ష్మణ రావు, ముత్యాలరావు పాల్గొన్నారు

అచ్యుతాపురం : అదాని స్మార్ట్ మీటర్ల బిగించడం వలన వినియోగదారులపై అదనపు భారం పడుతుందని సిపిఎం నాయకులు కె.సోము నాయుడు అన్నారు. మండలంలోని భోగాపురం గ్రామంలో శనివారం సాయంత్రం స్మార్ట్ మీటర్ల బిగించడంపై ఆయన ఇంటింట ప్రచారం చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి పద్మ, బి స్రవంతి, కె రాముతల్లి, సిహెచ్ రమణమ్మ, జి సన్యాసిరావు పాల్గొన్నారు.

భోగాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న సోమునాయుడు

టిడ్కో గృహాలవాసులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్, కొణతాల

టిడ్కో గృహాల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని శిరసపల్లి, కొండ కొప్పాక, సత్యనారాయణపురం గ్రామాలలో ఉన్న టిడ్కో గృహాలను రాష్ట్ర టిడ్కో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడ్కో కాలనీలలో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలోనే టిడ్కో కాలనీలలో మౌలికసదుపాయలు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీ ఫెలోషిప్‌కు ప్రసాద్ ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అఖిలభారత సాంకేతిక విద్యామండలి అందిస్తున్న ఇండస్ట్రీ ఫెలోషిప్‌కు అచ్యుతాపురానికి చెందిన ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ ఎంపికయ్యారు. దేశంలో వివిధ పరిశ్రమల అనుసంధానంతో అందిస్తున్న ఇండస్ట్రీ ఫెలోషిప్‌కు ఎంపిక అవడం చాలా అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. సి డ్యాక్ పూణె ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సూపర్ కంప్యూటింగ్, క్వాంటం కంప్యూటింగ్)లో ఏడాది పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో నెలకు లక్షరూపాయలు ఫెలోషిప్ అందుకోనున్నట్లు ప్రసాద్ తెలిపారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-మునగపాక : తమతో విద్యనభ్యసించిన మిత్రుడు అకాల మరణం చెందగా, ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు పూర్వ విద్యార్థులు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన సొంత్యన నాగేశ్వరరావు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో అకాల మరణం చెందారు. దీంతో 1994-95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం మిత్రుని దిన కార్యక్రమాలలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ వంతు సహాయంగా రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. నిత్యవసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వై.సత్యనారాయణ, కర్రి భాస్కరరావు, కాండ్రేగుల రామకృష్ణ, ఏవీ సత్యనారాయణ, ప్రసాద్, దొడ్డి రమణ, పట్టాభి, శరగడం ఆది విష్ణు, డాక్టర్ రవి, వీఎన్ఎస్ అప్పారావు, వై నాగేష్, దొడ్డి రామకృష్ణ, ఆడారి పద్మ, కోయిలాడు శివాజీ, ఎల్లపు త్రినాధ, పోలి కిరణ్, టివి రామలక్ష్మి, దాడి జయమని, గుప్తా పాల్గొన్నారు.

83వ వార్డులో మంచినీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 83వ వార్డులో మంచినీటి సమస్యను పరిష్కరించాలని వైసిపి యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షులు జాజుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తాగునీటి సరఫరా అధికారి హరీష్‌ను శనివారం ఆయన కలిసి మాట్లాడారు. లక్ష్మి దేవీపేట మాజీ కౌన్సలర్ విజయలక్ష్మి ఇంటివద్ద ఉన్న మినీ వాటర్ ట్యాంకు, ఏఎంసీ కాలనీ వైస్సార్ అపార్ట్మెంట్‌లో ఉన్న పైపు లైన్ సమస్యను, నాగావంశం వీధిలో పెద్ద వీధి నుండి వచ్చే పైప్‌లైన్ మరమ్మతుల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఏఈ హరీష్ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

ఒక్క మొలక కూడా రాని వరి నారుమడి

మొలకలు రాని వరి విత్తనాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కొండపాలెం గ్రామానికి చెందిన రైతు వ్యవసాయ శాఖ ద్వారాగా తీసుకున్న వరి విత్తనాలు మొలకలు రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొండపాలెం గ్రామానికి చెందిన ముచ్చకర్ల తాతీలు 20 రోజుల క్రితం కేపీ అగ్రహారం సచివాలయం నుండి ఆర్‌జెఎల్ రకం వరి విత్తనాలు రెండు బస్తాలు తీసుకొని వరి నారు వేశాడు. రోజులు గడిచినా వరి విత్తనాలు మొలకెత్తలేదని రైతు వాపోయాడు. అధికారులు నకిలీ విత్తనాలు సరఫరా చేసిన కంపెనీపై చర్యలు తీసుకోవాలని, తనను ఆదుకోవాలని ఆయన కోరుతున్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : విద్యార్థులకు మంచి బోధనతో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి అప్పారావు నాయుడు అన్నారు. మండలంలోని చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. చక్కని ప్రణాళికతో తగిన కృత్యాలు ద్వార బోధించాలని సూచించారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. వెనుకబడిన విద్యార్థులు ఎందుకు చదువ లేక పోతున్నారో గమనించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో 100 శాతం హాజరు నమోదు జరగాలని, డ్రాపౌట్‌ను గుర్తించి వారిని తిరిగి జాయిన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు కె.సత్యనారాయణ డీవీడీ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు కె.రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ అప్పారావునాయుడు

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-చోడవరం

జాబ్ మేళ ద్వారా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. చోడవరం డిగ్రీ కాలేజ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకున్న యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి పొందడానికి ఈ జాబ్ మేళాలు దోహదపడతాయని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ రంగం కంటే ప్రైవేటు రంగంలో పనిచేసే వారికే అధిక వేతనాలు వస్తున్నాయని తెలిపారు. జాబ్ మేళాలో 18 కంపెనీలు పాల్గొనగా 380 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వారిలో 145 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, టిడిప జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి మల్లు నాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని చక్కదిద్దుతున్నాం

గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని చక్కదిద్దుతున్నామని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి అవినీతి పరమావధిగా పరిపాలన సాగించిందని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో ఇప్పటికే కొన్ని నెరవేరయ్యాయని చెప్పారు. బనకచర్ల విషయంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు వాదనకు పసలేదన్నారు. సముద్రంలోకి వృథాగా పోతున్న వేలాది టీఎంసీలు నీటిలో 200 టీఎంసీలు మాత్రమే మనం వినియోగించడానికి ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలోని పెద్దేరు, తాచేరు, రైవాడ రిజర్వాయర్లకు 100 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.

వ్యవసాయ మార్కెట్ కొత్త కమిటీ నియామకం ఎప్పుడు?

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి వ్యవసాయ మార్కెట్‌కు కొత్త కమిటీ నియామకం ఎప్పుడు జరుగుతుందోనని ఎదురు చూస్తున్నారు. అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పచ్చికూర రామును నియమిస్తూ రెండు నెలల క్రితం ప్రకటనలు జారీ చేశారు. చైర్మన్‌తో పాటు 20 మంది పాలకవర్గం సభ్యులు ఉండాల్సి ఉంది. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షులుగా స్థానిక శాసనసభ్యులు వ్యవహరిస్తారు. ఇందులో 12 మంది రైతులు, ముగ్గురు వర్తకులు, ఒక కో-ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్, వ్యవసాయ మార్కెటింగ్ సహాయ సంచాలకులు, ఏజిహెచ్/ ఏడిఏ/ ఏడిఎఫ్/ ఏడిఏహెచ్ ఒకరు, గ్రామ పంచాయతీ సర్పంచ్ లేదా మున్సిపల్ చైర్మన్‌తో కలసి 20 మంది ఉంటారు. రైతుల్లో కనీసం ఐదుగురు చిన్న రైతులు, పశువుల పెంపకందారులు, ఐదు ఎకరాల మాగాణి లేదా 10 ఎకరాల పైబడ్డ మేరక భూమి ఉన్న రైతులు ఉంటారు. 12 మంది రైతులు, ముగ్గురు వర్తకుల్లో 15శాతం ఎస్సీలకు అనగా ముగ్గురు, ఆరు శాతం ఎస్టీలు అనగా ఒకరు, నలుగురు బీసీలు ఉండాలి. వీరులో నలుగురు పురుషులు, నలుగురు స్త్రీలు, ఓసిలో నలుగురు పురుషులు, ముగ్గురు స్త్రీలు వెరసి 15 మంది ఉంటారు. అయితే ప్రస్తుతం అనకాపల్లి మార్కెట్ కమిటీకి వీరి జాబితాను అధికార పక్షం అందజేయాల్సి ఉంది. అయితే చైర్మన్ నియామకం ప్రకటించి రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు సభ్యుల పేర్లను సీఎమ్ఓ కార్యాలయానికి పంపకపోవడంతో పాలకవర్గ ప్రమాణం ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. అయితే కూటమిలో తెలుగుదేశం పార్టీ నుంచి ఆరుగురు సభ్యులను ఇప్పటికే ఎంపిక చేసినట్టు, మిగిలిన పార్టీల నుంచి ఎంపిక చేసి ఇవ్వాల్సి ఉన్నట్టుగా తెలియవస్తోంది. ఇవి ఎప్పుడు ఇస్తారో, ఎప్పుడు ప్రమాణం స్వీకారం కమిటీ చేస్తుందో చూడాల్సి ఉంది.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి కలగా లక్ష్మి

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-కశింకోట : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కలగ లక్ష్మి, గున్నయ్య నాయుడు అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ తాళ్లపాలెం, ఉగ్గినపాలెం సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్వాసిత రైతులు 400మంది ఉన్నారని, వారి భూమి రైతుల సమక్షంలో రీ సర్వే చేయాలని కోరారు. కశింకోట పశువైద్యాధికారి చైతన్య మణి మాట్లాడుతూ మండలంలో 25 గోకులం షెడ్‌లు నిర్మాణం పూర్తయినట్లు చెప్పారు. పలువురు సర్పంచులు తమ గ్రామాల్లో ఉన్న నీటి సమస్యలు, విద్యుత్ అంతరాయంపై ప్రశ్నించారు. బెల్ట్ షాపులు గ్రామాల్లో ఎక్కడికెక్కడ విరవిగా పెరిగిపోయాయని తాళ్లపాలెం ఎంపిటీసీ లగిశెట్టి భవానీ గణేష్ తెలపగా, ఎక్సైజ్ ఎస్ఐ గణేష్ సమాధానం ఇస్తూ వాటిని పూర్తిగా అరికట్టామని ఏమైనా ఉంటే 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్‌రాజు, మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో సర్పంచ్, ఎంపిటిసిలకు ప్రోటోకాల్ పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నిషేధం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో తహాశీల్దారు తిరుమలరావు, వైస్ ఎంపిపిలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, ఎంపీడీవో వివి రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో తోటరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విఆర్ఒ ఈశ్వరరావు మృతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట గ్రామ రెవెన్యూ అధికారి మొలిపాక ఈశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. కొద్దికాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. రెండేళ్లుగా ఆయన బుచ్చయ్యపేట విఆర్వోగా పనిచేస్తున్నారు. విఆర్వో మృతికి తహసిల్దార్ లక్ష్మి, రెవిన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు. ఈశ్వరరావు స్వస్థలం మాడుగుల మండలం చింతలూరు అగ్రహారం.

భవనం పైనుండి పడి తాపీమేస్త్రి మృతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని తైపురం గ్రామానికి చెందిన నక్కా భూలోక అనే తాపీమేస్త్రి భవనం పైనుండి పడి మృతి చెందారు. భూలోక మునగపాక మండలం తోటాడలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా శుక్రవారం సాయంత్రం జారి కింద పడిపోయాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి శనివారం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. భూలోక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాదం నెలకొంది.

పిహెచ్‌సిని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్చుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, జిల్లా పరిషత్ విశ్రాంతి భవనాన్ని శనివారం ఉదయం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు పనితీరు మౌలిక సదుపాయాలు వంటి వాటిని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ద్వారపురెడ్డి బాబ్జి, కె వెంకటరమణ, పిన్నమరాజు వాసు, ఒడిసెల సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-మునగపాక : గ్రామపంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మునగపాకలో అండర్ గ్రౌండ్ పైపులైను పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయితీ కార్యాలయం నుండి నందీశ్వర కళా ప్రాంగణం వరకు అండర్ గ్రౌండ్ పైపుల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న మండలంలోని ఎర్రవరం గ్రామానికి చెందిన 43 మంది పాడి రైతులకు రెండు లక్షల 15 వేల రూపాయలు బోనస్‌గా డెయిరీ మేనేజర్ కె శేషు చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమములో నాగేశ్వరరావు, శ్రీను, రాంబాబు, సాయి కోటి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ గొడౌన్‌లో పాఠశాల నిర్వహణ

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
- భవన నిర్మాణం చేయాలని దండం పెడుతూ వేడుకోలు

ప్రజాశక్తి-వడ్డాది

20 మందికి పైగా విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలకు భవనం లేదు. శిథిలమైన పాఠశాల భవనాన్ని మూడేళ్ల క్రితం తొలగించగా, కొన్నాళ్లు అంగన్వాడీ కేంద్రంలోనూ, ప్రస్తుతం రేషన్ గొడౌన్‌లోనూ పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇదేదో ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో అనుకుంటే పొరపాటే. మైదాన ప్రాంతంలోని చోడవరం నియోజకవర్గం పరిధి బుచ్చయ్యపేట మండలం కొమ్మలపూడి శివారు గ్రామం బుదిరెడ్లపాలెంలో ఈ దుస్థితి నెలకొంది.

బుదిరెడ్లపాలెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల భవనం శిథిలం కావడంతో మూడేళ్ల క్రితం నాటి ప్రభుత్వ పెద్దలు, అధికారులు కొత్త భవనం నిర్మిస్తామని చెప్పి దానిని తొలగించారు. కాని నేటికీ కొత్త భవనం నిర్మాణం జరగలేదు. నాటి నుండి పిల్లలు పాఠశాల భవనం కోసం ఎదురు చూస్తున్నారు తప్ప ఏ ఒక్క అధికారి, ప్రజాప్రతినిధి స్పందించిన దాఖలాల్లేవు. నాటి నుండి గతేడాది వరకు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పాఠశాలను నిర్వహించారు. అయితే అంగన్వాడీ సెంటర్‌లో పిల్లల అల్లరికి పాఠశాల విద్యార్థులకు విద్యా బోధన కష్టతరంగా మారింది. దీంతో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించేశారు. కానీ పేదలు ఫీజులు కట్టలేక తమ పిల్లలను ఇదే పాఠశాలలో కొనసాగిస్తున్నారు. ఇప్పటికీ 1 నుండి 5వ తరగతి వరకు 20 మందికిపైగా పిల్లలు ఉన్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నుండి దగ్గరిలో ఉన్న రేషన్ గొడౌన్‌లో ఒక గదిలో పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఎండ వచ్చినా, వర్షం వచ్చినా నేరుగా గొడౌన్‌లోకి రావడంతో పిల్లలు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ సరైన వసతులు లేక నానా అవస్థలకు గురవుతున్నారు. దీనికి దగ్గరిలో మధ్యాహ్నం భోజనం వంటలు చేస్తే అక్కడికి వెళ్లి పిల్లలు భోజనాలు చేయాల్సి వస్తోంది. తమ పాఠశాలను అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నారు. కాగా తమకు కొత్త పాఠశాల భవనం నిర్మించాలని కోరుతూ చిన్నారులు శనివారం దండాలు పెట్టి వేడుకుంటూ నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బుదిరెడ్లపాలెం పాఠశాలకు భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల నిర్వహిస్తున్న రేషన్ గొడౌన్ ఎదుట దండం పెడుతూ నిరసన తెలుపుతున్న చిన్నారులు

టిడిఆర్ బాండ్లకు నిర్వాసితులు వ్యతిరేకం

ఐక్యంగా పోరాడితే తప్ప న్యాయం జరగదు : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం మండల కన్వీనర్ రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్చుతాపురం -అనకాపల్లి రహదారి విస్తరణలో భూములు, గృహాలు కోల్పోతున్న నిర్వాసితులకు ప్రభుత్వం ప్రకటించిన టిడిఆర్ బాండ్లను నిర్వాసితులందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సిపిఎం మండల కన్వీనర్ రొంగలి రాము స్పష్టం చేశారు. అచ్యుతాపురంలో శనివారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌తో అనకాపల్లి కలెక్టర్ ఆఫీసులో శుక్రవారం సాయంత్రం జరిగిన చర్చల్లో భాగంగా అఖిలపక్ష పార్టీలకు చెందిన నాయకులు, నిర్వాసితులు టిడిఆర్ బాండ్లను వ్యతిరేకించినట్లు తెలిపారు. టిడిఆర్ బాండ్లు వద్దని అచ్చుతాపురం, చోడిపల్లి, హరిపాలెం, తిమ్మరాజుపేట, మునగపాక, నాగులపల్లి, ఒంపోలు నిర్వాసితులు, నిర్వాసిత సంఘం నాయకులు ముక్తకంఠంతో స్పష్టం చేశారని స్పష్టం చేశారు. బాండ్ల వల్ల నష్టపోతామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. స్థలాలు, భవనాలకు మార్కెట్ విలువ కంటే తక్కువ విలువ కట్టడం, 100 అడుగులు రోడ్డు తర్వాత నిర్మాణాలకు పర్మిషన్ ఇవ్వకపోవడం వంటి అనేక విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నిర్వాసితులందరూ ఐక్యతగా పోరాడితే తప్ప న్యాయం జరగదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కే రామసదాశివరావు, కర్రి అప్పారావు, ఎం రాంకుమార్, ఎస్ బ్రహ్మాజీ, బుద్ధ రంగారావు, కె.సోమునాయుడు, చేపల తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం తయారీపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఐద్వా ఆధ్వర్యాన ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలంలో కల్తీ మద్యం తయారీపై ఇప్పటికీ సమగ్రమైన విచారణ చేపట్టకపోవడాన్ని ఐద్వా నేతలు తీవ్రంగా ఖండించారు. కల్తీ మద్యం తయారీ దారులపై కఠన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యాన శనివారం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం మాట్లాడుతూ జూలై 2వ తేదీన పరవాడలో పట్టుబడిన కల్తీ మద్యం కేసు ఇప్పటికీ విచారణకు నోచుకోకపోవడం తీవ్ర విచారకరమన్నారు. ఈ కల్తీ మద్యం రాష్ట్ర వ్యాప్తంగా బ్రాందీ షాపులు, బెల్ట్ షాపులకు సరఫరా అవుతుండటంతో ప్రజల ఆరోగ్యం పాడవుతుందని, అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ హామీలకు విరుద్ధంగా నివాస ప్రాంతాల వద్ద కూడా మద్యం షాపులు నడుస్తున్నాయని, మంచినీళ్ల దొరకనంతగా మద్యం అందుబాటులో ఉందని ధ్వజమెత్తారు. బెల్ట్ షాపులు నిర్వహించే బ్రాందీ షాపుల లైసెన్సులను రద్దు చేయాలని, మద్యాన్ని పూర్తిగా నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు మన్యాల బంగారమ్మ, కార్యదర్శి తుంపాల అన్నపూర్ణ, నాయకులు నాగదేవి, రాజకుమారి, కే. కృప తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం

విగ్రహాల ఏర్పాటుకు రూ.1.5 లక్షల విరాళం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం, వడ్డాది కొత్తూరు సింహబలుడు కొండపై నిర్మిస్తున్న సీతారామాలయం గర్భగుడిలో లక్ష్మీదేవి, గరుడాలయంలో హనుమంతుడి విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు స్థానిక భక్తుడు వర్రి వెంకటరమణ శనివారం రూ.1.5 లక్షలు విరాళం అందించారు. విరాళ దాతలను కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.

అనుమతులు తీసుకొనే మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొల్లలపాలెం, నంగినారపాడు గ్రామాల రెవెన్యూ పరిధిలో ఉన్న రాయపురాజు చెరువులో ప్రభుత్వ అనుమతులు తీసుకొని మట్టి తవ్వకాలు చేస్తున్నట్లు జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల వెంకటరమణ స్పష్టం చేశారు. ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ చేసిన వ్యాఖ్యలను వెంకట రమణ తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నంగినారుపాడు గ్రామంలో 0.47 సెంట్లుకు మట్టి ఫీలింగ్ కొరకు సబ్బవరం మండలం తహాశీల్దార్, ఇరిగేషన్ అధికారుల నుండి జీవో నెంబర్ 203 ప్రకారం అనుమతి తీసుకొని మట్టి తవ్వకాలు చేసినట్లు తెలిపారు. ఆ జీవో గురించి కనీసం తెలుసుకోకుండా నిరాధారమైన ఆరోపణలు చేయడం మాజీ ఎమ్మెల్యేకు తగదన్నారు. 2019 నుంచి 2024 వరకు వారు అధికారంలో ఉన్నప్పుడు వైసిపి నాయకులు ఎలాంటి అక్రమాలు చేశారో, ఇప్పటికి వారు ఏ రకంగా కొనసాగిస్తున్నారో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునని మండిపడ్డారు.

డైట్‌లో ఘనంగా పట్టభద్రుల దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు పట్టభద్రుల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎపి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్‌రావు ముఖ్య అతిథిగా, బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ సత్యప్రసాద్, టెక్ మహేంద్ర వివేకానంద చల్ల గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు తమ సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ డైట్ కళాశాల విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో అనేక బహుళ జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. గౌరవ అతిథి సత్య ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు అంకుర సంస్థలను ప్రారంభించాలన్నారు. డైట్ కళాశాలతో అనుబంధంగా రూ.25 లక్షలతో రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. వివేకానంద చల్ల మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామిక రంగానికి కావాల్సిన విధంగా తమని మలుచుకోవాలని సూచించారు. అనంతరం పట్టభద్రులకు సర్టిఫికెట్లను అందజేసారు. కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్ ప్రసాద్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీధర్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మునగపాక, గణపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ శిక్షణా తరగతులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో ఎంఈఓలు డి.వేణుగోపాల్, బి.శివ నాయుడు పాల్గొని విద్యాభివృద్ధి, విద్యార్థుల సంఖ్య పెంపుదల, అభ్యసనా నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హెచ్ఎంలు ఎం.శ్రీనివాసరావు, చిత్రపు రోజామణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలలో హెచ్ఎంలు గాలి అప్పారావు, కే శంకర్రావు, ఆర్పీలు ఎంవై రాము, ఆర్ఎస్ఎన్.మూర్తి, బి విజయవాణి, ఎం కళ్యాణ్, సృజన, సిఆర్ఎంపిలు కర్రి లక్ష్మీ నారాయణ, బి అచ్యుత కృష్ణ, ఆర్ సత్తిబాబు, ఎం గోవింద, జి నూకేష్, స్కూలు అసిస్టెంట్లు, ప్రైమరీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఆదివారం 20 జులై 2025

ఉపాధి హామీ కూలీలకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:ఎస్.రాయవరం మండలంలో జంగులూరు, వేలంపాలెంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యమ్ సత్యనారాయణ పర్యటించారు. ఉపాధి కూలీల సమస్యలు అడిగారు. తమకు సుమారు 11 వారాల నుంచి పేమెంట్లు రావాల్సి ఉందని, వారం వారం ప్లేసిప్లులు ఇవ్వలేదని, పని ప్రదేశంలో టెంట్, పనిముట్లు, ఇవ్వలదన్నారు. ఈ సందర్భంగా ఎం సత్యనారాయణ మాట్లాడుతూ,11 వారాల నుంచి బకాయిలు ఇవ్వకుంటే కూలీలకు పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. అదేవిదంగా పని ప్రదేశంలో పాము కుట్టిన కార్మికులు అనేకమంది ఉన్నాన్నారు. వాళ్ళకి ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదన్నారు. పేమెంట్లు, గుణపాలు, మెడికల్ సదుపాయాలు లేవన్నారు. ఇటీవలే పెద్దప్పలం గ్రామంలో ఒక ఆమెకు పాము కాటు వేయడంతో నాలుగు నెలల కాలం నుంచి మంచాన పడిందన్నారు. ఇప్పటికి అధికారులు స్పందించే పరిస్థితి లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలని కోరారు. గతంలో వారం వారం ప్లేసిప్ల ఇచ్చి 15 రోజులకే పేమెంట్స్ చెంచారని, కూటమి ప్రభుత్వం బకాయిలు కూడా చెల్లించక పోవడం అన్యాయమన్నారు. 15 రోజులకే పేమెంట్ చెల్లించకపోతే వడ్డీతో డబ్బులు ఇవ్వాల్సి ఉందన్నారు. ఉపాధి కూలీలకు పనికి వేతనాలను సక్రమంగా రోజుకి 300 రూపాయలు చెల్లిస్తానని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో అమలు కాలేదన్నారు. పని ప్రదేశంలో నీడ, మంచినీళ్లు, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లండి

మాజీ ఎమ్మెల్యే గణేష్

పోస్టర్ ఆవిష్కస్తున్న గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ:కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైసీపీ శ్రేణులు ఇంటింటికి తీసుకువెళ్లాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం ఎర్రవరం రాజులబాబు గుడి వద్ద శనివారం మండల పార్టీ అధ్యక్షులు ఫణి శాంతారామ్ అధ్యక్షతన వైసీపీ గొలుగొండ మండల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంకు ముఖ్య అతిధిగా హాజరైన ఉమాశంకర్‌గణేష్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబునాయుడు పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. ఎన్నికల సమయంలో అమలు చేయలేని హామీలిచ్చి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చారని ఎద్దేవా చేశారు. వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అధికంగా అప్పులు చేశారని కూటమి నాయకులు అబద్ధాలు చెప్పి ప్రజలను నమ్మించారన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వమే అధికంగా అప్పులు చేసిందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి ఇటీవల తెలిపారని చెప్పారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకుల మోసాలను వైసీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఫాణి శాంతారామ్, ఎంపిపి గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైస్ ఎంపిపిలు సుర్ల ఆదినారాయణ, జక్కు నాగమణి, ఏఎల్.పురం సర్పంచ్ లోచల సుజాత, మండల యువజన విభాగ అధ్యక్షులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండల వైసీపీ సమావేశం మండల పార్టీ అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం తంగేడు గ్రామంలో నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ, గతంలో వైసిపి కార్యకర్తల పట్ల నిర్లక్ష్యం వహించడం వల్లే మూల్యం చెల్లించుకోవలసి వచ్చిందని, పార్టీ కార్యకర్తల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పార్టీ ఆదేశాల మేరకు సమావేశాల ద్వారా అభిప్రాయాలు తెలుసుకుంటున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ మండలంలో కార్యకర్తలు ప్రజలు ఎక్కువగా వైసిపి పార్టీని ఆదరిస్తారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అంతా కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు, ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ రాజు, పైల రమేష్, సత్తిబాబు, కుమార్ రాజా హాజరయ్యారు.

సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

భూసమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ ఎంపీడీవో కార్యాలయంలో శనివారం భూసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను నిర్వహించారు. తహసీల్దార్ పీ.శ్రీనివాసరావు, ఎంపీడీవో మేరీ రోజ్, ఎస్ఐ పీ.రామారావు అర్జీదారులతో సమావేశమయ్యారు. సాధ్యమైనంత త్వరగా భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. సామరస్యంగా భూసమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

పండ్ల తోటల సాగుతో రైతులకు ఆదాయం

ప్రజాశక్తి -మాడుగుల:పండ్ల మొక్కల పెంపకం ద్వారా రైతులకు లబ్ధి చేకూరడమే కాకుండా పర్యావరణాన్ని కూడా కాపాడువచ్చునని ఎంపీడీవో కొంకి అప్పారావు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు మామిడి,కొబ్బరి, జీడిమామిడి, పామాయిల్ మొక్కలు పెంచడానికి ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని తెలిపారు. రైతులు వీటి ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చునని ఆయన అన్నారు. శనివారం మాడుగుల నుండి ఖండివరం వెళ్లే తోవలో ఉన్న పెద్దచెరువు గట్టు మీద ఏపీవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో 300 కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీనారాయణ, పిఏసిఎస్ పర్సన్ ఇంచార్జ్ కొట్నాల త్రినాథ్, లెక్కల కాశి బాబు, పేరేచర్ల సూర్యనారాయణ రాజు వీఆర్పీలు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న అధికారులు

విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించాలి

మాట్లాడుతున్న ఎంఇఒ నరేష్

ప్రజాశక్తి -నక్కపల్లి:పాఠ్య బోధనతో విద్యార్థుల్లో నైపుణ్యత పెంపొందించాలని ఎంఈఓ నరేష్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలో చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్‌ఎం బాలాజీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నరేష్ మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌ను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన, నాణ్యమైన విద్యా బోధన అందించాలన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు మానవతా విలువలను కూడా తెలియజేయాలన్నారు. పాఠశాలలు సందర్శించే సమయంలో ప్రతీ విద్యార్థికీ చదవడం, రాయడంపై పరిశీలన జరుపుతామన్నారు.ప్రతీ అంశాన్ని కృత్యాల ఆధారంగానే బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: బడి బయట విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని ఎంఇఒ రామారావు సూచించారు. శనివారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సదుపాయాల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఉపాధ్యాయులు పరిశీలించాలన్నారు, ప్రధాన ఉపాధ్యాయులు సుకుమార్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న అధికారులు

క్లాప్ మిత్రలకు సన్మానం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీవో డి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలిసి క్లాప్ మిత్రలను సన్మానించారు. అనంతరం వేంపాడు గ్రామంలో పర్యటించి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వర్మి కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. గ్రామంలో ప్రతి ఇంటా తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించి సంపద సృష్టించుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సిఐ కుమారస్వామి, ఇతర సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు

పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఇఇ ప్రసాద్

డ్రెయినేజీని పరిశీలించిన ఇఇ

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగుల గ్రామం మధ్యలో ఉన్న జవ్వాది గెడ్డ డ్రైనేజీని పంచాయతీ రాజ్ ఈఈ ప్రసాద్ శనివారం పరిశీలించారు. గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది శ్రీనాథ్ ప్రసాదరావు ప్రజా సమస్య పరిస్కార వేదికలో పెట్టిన దరఖాస్తు మేరకు వచ్చి పరిశీలించడం జరిగిందన్నారు.వారం రోజులలో జెసిబితో డ్రైనేజీ పూర్తిగా శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ జెఈ శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ జేఈ నాగమల్లేశ్వరి, పంచాయతీ కార్యదర్శి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారి శివప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- మాడుగుల:అనకాపల్లి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పంచాయతీరాజ్ ఈఈ ఆర్.శివప్రసాద్ మండల ప్రత్యేక అధికారిగా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహించిన వీరంనాయుడు సెలవులలో ఉండగా ఆయన స్థానంలో శివ ప్రసాద్ నియామకం అయ్యారు.

అభినందిస్తున్న ఉద్యోగులు

ఇఒపిఆర్‌డి కూర్మారావు బాధ్యతలు

ప్రజాశక్తి కోటవురట్ల:ఈ ఓ పి ఆర్ డిగా కూర్మారావు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా రేగిడి మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇంచార్జ్ ఈవోపీఆర్డిగా బికేపల్లి కార్యదర్శి రఘురాం పనిచేశారు. ఈ సందర్భంగా కూర్మారావుకు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

చెక్కులను ఇస్తున్న రాజేష్

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ గోపాల్, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలోని నర్సీపట్నం మున్సిపాలిటీ రామారావు పేట కు చెందిన రామోజు నాగ సూర్య శ్రీ షణ్ముఖ, అయ్యన్నపాలెం కురచ రాజులమ్మ, గొలుగొండ మండలం చీడిగుమ్మల వేమగిరి చక్రం, పెట్ల మహాలక్ష్మిలకు చెక్ లను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలకు సీఎం సహాయనిధి గొప్ప భరోసాగా నిలుస్తోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి అనేక పేద కుటుంబాలకు ఆపద సమయంలో ఆశ్రయంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో పైల గోవిందు, రాజబాబు, రాజా, కామిరెడ్డి గోవిందు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న గ్రామ నాయకులు...

ఉద్యోగులకు ఘన సత్కారం

ప్రజాశక్తి -మాడుగుల: మండలంలో పొంగలిపాక గ్రామ పంచాయతీ, సచివాలయం, ప్రభుత్వ పాఠశాలలో ఇప్పటివరకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన అధికారులకు, ఉపాధ్యాయలకు వీడ్కోలు తెలుపుతూ సత్కరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉద్యోగులకు స్వాగతం పలుకుతూ వారిని ఎంపీడీవో కొంకి అప్పారావు, సర్పంచ్ నాయన సత్యనారాయణ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేవుడు ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మైచర్ల సన్యాసిరావు, నీటి సంఘం అధ్యక్షులు బంటుమల్లు నాయుడు, పచ్చికూర ఇరుకు నాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు నాయన జోగినాయుడు, రవి, కుమార్, నాగు తదితరులు పాల్గొన్నారు.

జడ్.జోగంపేటలో సివిల్ సప్లై డిటి పర్యటన

ప్రజాశక్తి- రావిమతం: మండలంలో చీమలపాడు పంచాయతీ జడ్ జోగంపేట గ్రామంలో జిసిసి సబ్ డిపో ఏర్పాటు చేయాలని. గిరిజనులు చేసిన ఆందోళనకు స్పందించిన రావికమతం సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ జి .భాస్కరరావు శనివారం గ్రామాన్ని సందర్శించారు.జడ్ జోగంపేట నుండి కళ్యాణ్ లోవ ఎన్ని కిలోమీటర్లు ఉంటుందని అడగగా సుమారు 6 ఆరు కిలోమీటర్ దూరం ఉంటుందని తెలిపారు. జడ్ జోగంపేట చుట్టుపక్క గ్రామాలు ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయన్నారు. ఈ గ్రామంలో జీసీసీ సబ్ పాయింట్ ఏర్పాటు చేసినట్లయితే చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరికీ మేలు జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

నగర మేయర్‌కు అభినందన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కు గానూ మహా విశాఖపట్నం నగర పాలక సంస్థకు సఫాయిమిత్ర సురక్షిత్ షహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమస్థానం పురస్కారాన్ని అందుకున్న నగర మేయర్ పీలా శ్రీనివాసరావును జివిఎంసి స్థాయి సంఘ సభ్యులు జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం అభినందించారు.

చెవులు చిల్లులు పడేలా... స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగరంలో ప్లాస్టిక్‌ను భూతంగా చూపుతూ జరిగే విస్తృత ప్రచారానికి ఆకాశమే హద్దు అనడం ఎలాంటి అతిశయోక్తి కాజాలదు. పైగా చంద్రబాబు ప్రభుత్వం అంటేనే 'స్వర్ణాంధ్ర' మాట లేకుండా పరిపాలన ప్రారంభం కానేకాదు. 1990వ దశకం నుంచీ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అంటూ ప్రభుత్వ ప్రాధాన్యతలను తెలియజేస్తూ అధికార యంత్రాంగం సాక్షిగా రూ.వేలకోట్లు వ్యయం చేసే సంగతి గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ప్లాస్టిక్ పర్యావరణానికి హానికరమని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రాణాంతకమన్న సంగతి వినియోగిస్తున్న ప్రజలకు తెలియక నగర పాలకులు ప్రచారం సాగిస్తున్నారా? రూ.వందలకోట్లు ప్రజలు జివిఎంసికి ఏటా చెల్లించే పన్నులను ఇలా పర్యావరణం, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర చేస్తామంటూ ప్రచారానికి, పబ్బం గడుపుకోడానికి వెచ్చించడం సబబేనా? అంటే జివిఎంసి అధికారుల్లోనే గుసగుసలు లేకపోలేదు. కాలుష్యానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలను లేకుండా చెయ్యడం ప్రభుత్వ పని. అందుకు ప్రధానంగా ప్లాస్టిక్ ఎక్కడైతే ఉత్పత్తి జరుగుతుందో అక్కడ నివారించాల్సిందే. విశాఖ నగరంలోని గాజువాక ప్రాంతంలో ప్లాస్టిక్ సంచుల ఉత్పత్తులు బయటకొస్తున్నాయి. అక్కడ అధికార యంత్రాంగం, నగర పాలక సంస్థకు చెందిన అధికారులు, ప్రధాన పక్షాలకు చెందిన ప్రజా ప్రతినిధులు నెలనెలా ఆమ్యామ్యాలు మింగుతూ ప్లాస్టిక్ ఉత్పత్తుల జోలికి పోవడం లేదు. నగరంలో ఏ వార్డులో చూసినా ప్రజాప్రతినిధులు కొంతమంది, జివిఎంసి అధికారులు మార్కెట్ల వద్దకు వాలిపోయి ప్లాస్టిక్ సంచులను ఏరివేసే పేరుతో అమ్మేవారికి జరిమానాలు విధిస్తూ పబ్బం గడుపుకోవడం కనిపిస్తోంది. ప్రతినిత్యం, రైతు బజార్లలోకి, రోడ్లకు ఇరువైపులా అమ్ముకునే చిరువ్యాపారుల వద్దకు నగర పాలకులు వాహనాల్లో వచ్చి తూకాల కాటాలను ఎత్తుకెళ్లడం, ప్లాస్టిక్ సంచులకు కేసులు బుక్ చేసి నగదు వసూలు చేయడం చేయడం పరిపాటిగా మారిపోయింది. జిల్లా అధికార యంత్రాంగానికి స్వచ్ఛ ఆంధ్రా అంటూ చీపుర్లు పట్టించి ప్రతిజ్ఞలు చేయించడం కలెక్టరేట్‌లో శనివారం కనిపించింది. ఉద్యోగులు, సిబ్బంది ఈ పనులను విసుక్కుంటూనే చేయడం కనిపించింది. ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ ఎక్కడ చూసినా అధికార కార్యాలయాల్లో దర్శనమివ్వడం కొత్తేమీ కాదు.

స్పా సెంటర్లపై దాడి....

గడచిన కొద్దిరోజులుగా పోలీస్ అధికారులు స్పా (మసాజ్ సెంటర్)లపై దాడులు చేస్తున్నారు. వందల సంఖ్యలో నగరంలో స్పా కేంద్రాలు నడుస్తున్నాయి. ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయన్న ఫిర్యాదులతో ఒకటి అరా సెంటర్లపై దాడులకు పాల్పడుతున్నారు. వాస్తవానికి స్పా సెంటర్లకు ఏ నిబంధనలతో అనుమతులు మంజూరు చేశారన్న ప్రశ్న వేసుకోవడం లేదు. అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా సరే తప్పే. కానీ నగరంలో పలుచోట్ల నెలవారీ మామూళ్లను తీసుకుంటూ గప్‌చుప్ అయిపోతున్న ఖాకీల సంగతేమిటి? ఎక్కడో ఒక కేంద్రంపై ఫిర్యాదులొస్తే పోలీసులు కదలికలు కనిపిస్తున్నాయి. స్వచ్ఛాంధ్ర సాధన గానీ, పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నిషేధం గానీ, అసాంఘిక కార్యకలాపాలను నివారించడంలో గానీ 'మూలాల నుంచి పరిష్కారం వైపు చూడకుండా పైపైన చేపట్టే చర్యల వల్ల, అదెప్పటికీ సమస్యగానే ఉంటుంది. అందుకు సజీవ ఉదాహరణ కాలుష్య భూతం విశాఖనగరాన్ని చుట్టుముట్టేసింది. ఏళ్లతరబడి ప్లాస్టిక్ వినియోగం, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ, జివిఎంసి మీటింగుల్లోనూ ప్లాస్టిక్ బాటిళ్ల దర్శనమిస్తూనే ఉన్నాయి. ప్రజలు ఆరోగ్యంగా, ఆహ్లాదకరంగా జీవించే వాతావరణం రావాలంటే ప్రభుత్వం, అధికార యంత్రాంగం చేపట్టే తాత్కాలిక పనుల వల్ల కానేకాదు. శాశ్వత పరిష్కారం కోసం ప్రజల్లో చైతన్యం, అవగాహనే సరైనది.

వైసిపి హయాంలో పోలవరం, అమరావతిపై నిర్లక్ష్యం

-మంత్రి నిమ్మల రామానాయుడు,- గ్రామాల్లో టిడిపి ఇంటింటి ప్రచారం

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్, మంత్రి నిమ్మల,

ప్రజాశకి-నర్సీపట్నం: సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో శనివారం బలిఘట్టం గ్రామంలో మంత్రి నిమ్మల రామానాయుడు, సభాపతి అయ్యన్నపాత్రుడు, చోడవరం ఎమ్మెల్యే కె వి ఎస్ ఎన్ రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్య బాబు, మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ఆధ్వర్యంలో పర్యటించారు. పలు సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్లక్ష్యంతో పాటు అమరావతిపై విషం చిమ్మి విధ్వంసానికి పాల్పడ్డారని అన్నారు, ప్రస్తుత ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాలు పథకాలను ప్రజలకు చేరువ చేసిందని తెలిపారు, సభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ప్రభుత్వం తల్లికి అన్నదాత సుఖీభవ గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేసిందన్నారు.ఉచిత బస్సు ప్రయాణం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తుందని ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గవరెడ్డి వెంకటరమణ, జడ్పిటిసి సభ్యురాలు రమణమ్మ, పలువురు టిడిపి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చోడవరం : మండల కేంద్రం చోడవరం శివాలయం వీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఒక మహిళ ఏళ్ల తరబడి చోడవరంలో నివాసముంటున్న ఇంటి స్థలం, ఇల్లు లేదని మంత్రికి మొరపెట్టుకోగా, ఆయన స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తారకరామ రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలని మాడుగుల నియోజకవర్గ టిడిపి నాయకులు పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో మంత్రికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కెఎస్ఎన్ఎస్.రాజు, బండారు సత్యనారాయణ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ శివారు బొట్టవాణిపాలెం గ్రామంలో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వారి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి లాలం ఈశ్వరరావు, మొల్లి గంగాధర్, సారిపల్లి అప్పలరాజు, దాలి బోయిన హరిబాబు, బొట్ట జగదీష్, శీర నాగేష్ పాల్గొన్నారు.

జలాశయానికి నిధులు మంజూరు చేయండి

ప్రజాశక్తి -మాడుగుల: మండలంలో తాటిపర్తి గ్రామ సమీపంలో అసంపూర్తిగా ఉన్న తారకరామా జలాశయానికి నిధులు మంజూరు చేయాలని మాడుగుల మండల టిడిపి నాయకులు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కోరారు. శనివారం చోడవరం వచ్చిన ఆయనను శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తితో కలిసి విజ్ఞప్తి చేసినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఆయకట్టు ప్రతినిధులు రమణ భాస్కరరావు రమేష్ సన్యాసిరావు తెలిపారు. అలాగే పెద్దేరు జలాశయానికి నిధులు మంజూరు చేసినందుకుగాను జలాశయ చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, వడ్డీ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లా విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నంలోని న్యాయ సేవా సదన్, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యాన శనివారం ఎన్‌బిఎం లా కాలేజీ విద్యార్థుల కోసం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ, న్యాయ విద్యార్థులకు చట్టాలలోని ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. పేదలకు, అణగారిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడం ప్రతి న్యాయవాది యొక్క సామాజిక బాధ్యత అన్నారు. జి.వల్లభ నాయుడు, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎ. రామచంద్రరావు మాట్లాడుతూ, కేసుల విచారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విలువైన సూచనలు ఇచ్చారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ, సందేహాలను నివృత్తి చేశారు.

అరకులోయలో భారీ వర్షం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలంలోని పరిసర ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం ఏకధాటిగా కుండపోత వర్షం కురిసింది. నాలుగు రోజులుగా ఉదయం సమయంలో ఎండ మధ్యాహ్నం వాన కురుస్తోంది. దీంతో కొంత వరకు ప్రజలకు ఉపశమనం లభించింది. కుండ పోత వర్షం కారణంగా వాగులు, వంకలు, చెరువులు, పంట పొలాలు నిండిపోయి పొంగి పొర్లుతున్నాయి. పలు గ్రామాల్లో డ్రైనేజీలు లేక వరద నీరు రోడ్లపైనే పారుతుంది. దీంతో మండల కేంద్రానికి వివిధ పనులు నిమిత్తం వచ్చిన గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే నాలుగు రోజులుగా వర్షం కురవడంతో పెద్దలు, వృద్ధులకు ఉపశమనం కలుగుతోంది.

అంతర్జాతీయ పోటీలకు అంపైర్‌గా డివిఎస్‌వై శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: లావోస్‌లోని వియెంతినే వేదికగా ఆగస్టు 6 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న వరల్డ్ టేబుల్ టెన్నిస్ యూత్ కాంటెండర్, ఆగస్టు 11 నుండి 15 వరకు అదే వేదికపై జరగనున్న వరల్డ్ టేబుల్ టెన్నిస్ ఫీడర్ 2025 పోటీలకు బ్లూబ్యాడ్జి ఎంపైర్ హోదా, విదేశీ మ్యాచ్ అఫీషియల్‌గా విశాఖపట్నానికి చెందిన డివిఎస్‌వై శర్మ హాజరుకానున్నారు. పోటీలకు భారత్ నుండి ఎంపికైన ఏకైక వ్యక్తిగా శర్మ నిలిచారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నంలోని ఎల్‌ఐసిలో స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు మెంబర్‌గా పనిచేస్తూ విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి, రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.